ఔరంగాబాద్‌లో ఓటమితో లోకసభలో మజ్లి‌స్‌కు మళ్లీ ఒకే ఒక్కడు..!

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గత లోకసభలో ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్(మజ్లిస్) పార్టీకి ఇద్దరు సభ్యులుండగా ఈసారి ఒకే ఒక్క సభ్యుడితో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న మజ్లిస్ మొట్టమొదటిసారి 1984 పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి లోకసభలో అడుగుపెట్టింది. అప్పటి నుంచి వరుసగా ఆరుసార్లు సుల్తాన్ సలాఉద్దీన్ ఒవైసీ, అనంతరం ఆయన కుమారుడు అసదుద్దీన్ ఒవైసీ 2004 నుంచి ఇప్పటి వరకు ఐదుసార్లు లోకసభ సభ్యుడిగా వరుసగా ఎన్ని కయ్యారు. ఈ సారి అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజారిటీతో లోకసభకు ఎన్నికయ్యారు. కాగా, 2019లో మహారాష్ట్రలో జరిగిన రాజకీయ పరిణామాల్లో ఔరంగాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి మజ్లిస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఇంతియాజ్ జలీల్ విజయం సాధించి లోకసభలో అడుగుపెట్టారు. దీంతో గత లోకసభలో మజ్లిస్‌కు ఇద్దరు సభ్యుల బలం ఉండేది. ఈ సారి ఔరంగాబాద్ నుంచి పోటీ చేసిన ఇంతియాజ్‌జలీల్ శివసేన అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. అలాగే, బీహార్‌లోని కిషన్‌గంజ్ సీటును కైవసం చేసుకునేందుకు మజ్లిస్ తీవ్రంగా ప్రయత్నించింది. పార్టీ ఆ రాష్ట్రశాఖ అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ సైతం రెండు దఫాలుగా బీహార్‌లో పర్యటించి కిషన్‌గంజ్‌లో అక్తరుల్ ఇమాన్‌ను గెలిపించేందుకు విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. మూడోస్థానానికి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో గతంలో లాగే మళ్లీ లోకసభలో మజ్లిస్ పార్టీ ప్రతినిధిగా అసదుద్దీన్ ఒవైసీ ఒక్కరే ప్రాతినిధ్యం వహించనున్నారు.

కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు


పనులను పరిశీలిస్తున్న డీజీఎం మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ సురేష్

ముషీరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ పఠాన్‌బస్తీలో 15 రోజులుగా కలుషిత నీటిసరఫరా అవుతోందని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జలమండలి ఉన్నతాధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. కలుషిత నీటికి కారణాలను తెలుసుకునేందుకు కంప్యూటర్ సహాయంతో పైప్‌లైన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా చిలకలగూడ రిజర్వాయర్ డీజీఎం మోహన్‌రాజు, సెక్షన్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ... రెండు రోజుల క్రితమే నిండిపోయిన డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను ఎయిర్ టెక్ యంత్రాల సహాయంతో శుభ్రం చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా, మెరుగైన మంచి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పర్వేజ్, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అదృశ్యం


పి.వంశీరావు

బర్కత్‌పుర,జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులపాలైన జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అదృశ్యమైన సంఘటన కాచిగూడ పీఎస్‌పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ కె.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.... కాచిగూడ చప్పల్‌బజార్‌లో నివాసం ఉంటున్న దుర్గారావు కుమారుడు పి.వంశీరావు(30) జీహెచ్ఎంసీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. ఈనెల 3న మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటినుంచి బయటకు వెళ్లిన వంశీరావు తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి దుర్గారావు బుధవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపారు.

ఒడిశా నుంచి సికింద్రాబాద్‌కు గంజాయి రవాణా

హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బ్యాగ్‌లలో గంజాయి నింపుకొని ఒడిశా నుంచి రైల్లో హైదరాబాద్‌కు వచ్చి పోలీసుల కళ్లుగప్పి సరుకును సరఫరా చేయాలని చూసిన ఘరానా స్మగ్లర్‌ను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్ న్యూ) పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ. 5.55 లక్షల విలువైన 22 కేజీల గంజాయి బ్యాగ్‌లను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది స్మగ్లర్స్ మాదకద్రవ్యాలను గుట్టుగా నగరానికి తెస్తున్నారు. ఇదే క్రమంలో ఒడిశా గజపతి జిల్లాకు చెందిన కురేష్ షైక్ అలియాస్ కురేష్‌కు నగరంలోని గంజాయి స్మగ్లర్‌తో పరిచయం ఉంది. అతడి ఆదేశాల మేరకు కురేష్ 22 కేజీల గంజాయిని బ్యాగ్‌లలో నింపుకొని రైల్లో సికింద్రాబాద్ చేరుకున్నాడు. అక్కడి నుంచి బయటకు వచ్చి రిసీవర్ కోసం ఎదురుచూస్తున్నాడు. అతడికి సరుకు అందజేసి, డబ్బు తీసుకొని వెంటనే వెళ్లిపోవడానికి వేచి చూస్తున్నాడు. ఇంతలోనే విశ్వసనీయ సమాచారం అందుకున్న హెచ్ న్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డానియేల్ బృందాలు రంగంలోకి దిగాయి. మార్కెట్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి చేసి కురేష్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేతివృత్తుల వారికి జీవనాధారం కల్పించాలి

కవాడిగూడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తులను ప్రోత్సహించి వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారిని ఆదుకోవాలని అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్రకమిటీ అధ్యక్షురాలు కోట దేవకిదేవి కోరారు. ఎన్టీఆర్ స్టేడియంలో గతనెల 13న ఏర్పాటుచేసిన జాతీయ చేనేత, సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె బుధవారం సందర్శించారు. ఈనెల 9 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని ఆమె తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

చిక్కడపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగను చిక్కడపల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య వివరాలను వెల్లడించారు. గతనెల 29న అశోక్‌నగర్ నివాసి జయప్రకాష్ అగర్వాల్ ఇంటిపార్కింగ్ స్థలంలో పార్క్ చేసిన తన వాహనం చోరీ అయిందని అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసుదర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో బుధవారం నిందితుడు ఆర్‌కేపురానికి చెందిన అమర్‌సింగ్(29)ను అదుపులోకి తీసుకున్నారు. చోరీ అయిన వాహనంతో పాటు నిందితుడు నగరంలోని మార్కెట్, నేరేడ్‌మెంట్, మేడిపల్లిపోలీస్‌స్టేషన్ల పరిధుల్లో దొంగిలించిన మరో మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నాంపల్లి 9వ ఏసీఎంఎంకోర్టులో హాజరుపర్చగా 14రోజుల జుడీషియల్ రిమాండ్‌ను జడ్జి విధించారని సీఐ వివరించారు.


గోల్నాక చౌరస్తాలో కేక్ తినిపిస్తున్న బీజేపీ నాయకులు


స్వీట్లు పంపిణీచేస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, మాజీకార్పొరేటర్ రవీందర్


ముషీరాబాద్‌లో టపాసులు కాల్చుతున్న బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్

ఎంపీగా కిషన్‌రెడ్డి గెలుపు..

బస్తీల్లో బీజేపీ వేడుకలు


బండి సంజయ్‌ను సన్మానిస్తున్న మున్నూరుకాపు యువజనసంక్షేమ సంఘం, బీసీ ఐక్యవేదిక ప్రతినిధులు


కార్పొరేటర్ అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ఆధ్వర్యంలో.. స్వీట్ల పంపిణీ

నల్లకుంట/రాంనగర్/చిక్కడపల్లి/ కవాడిగూడ/గోల్నాక/ ముషీరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎంపీగా కిషన్‌రెడ్డి రెండోసారి గెలవడంతో బుధవారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో బీజేపీ కార్పొరేటర్లు, నేతలు సంబురాలు చేసుకున్నారు. కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు తినిపించుకున్నారు. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. నల్లకుంట, రాంనగర్, చిక్కడపల్లి, గోల్నాక, కవాడిగూడ ప్రాంతాల్లో వేడుకలను నిర్వహించారు. నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ఆధ్వర్యంలో సంబురాలు చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో విజయోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గోల్నాక చౌరస్తాలో పార్టీ నాయకులతో కలిసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, తమ సంతోషాన్ని పంచుకున్నారు. కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎంసి మహేందర్‌బాబు ఆధ్వర్యంలో దోమలగూడలో సంబరాలు నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా బీజేపీ నేతలు నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని అవ్వడంపై కూడా హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ మరోసారి కేంద్రంలో భారీమెజార్టీతో విజయం సాధించడంతో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ సమక్షంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో బాపూజీ నగర్‌లో నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

కవాడిగూడలో భారీ వర్షం

ఇబ్బందుల్లో వాహనదారులు, పాదచారులు

రోడ్లు జలమయం


దోమలగూడలో వర్షం వరదలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు


ఎన్టీఆర్ స్టేడియం వద్ద స్టీల్‌బ్రిడ్జి కింద వరదనీటి కాలువను శుభ్రం చేస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

కవాడిగూడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు, రోడ్లు వర్షం నీటితో నిండిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు అవస్థలు పడ్డారు. గంటసేపు వర్షం కురవడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించి పోయింది. రోడ్లపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచి పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కవాడిగూడలోని కల్పనామెయిన్‌రోడ్, పద్మశాలికాలనీ, ఎస్‌బీఐ కాలనీ, దోమలగూడ గాంధీనగర్ బ్రిడ్జి, ఇందిరాపార్కు చౌరస్తా, దోమలగూడ పరిసర ప్రాంతాల్లో వరదనీరు మోకాళ్లలోతు ప్రవహించింది. దీంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఎన్టీఆర్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో, స్టీల్ బ్రిడ్జికింద వరదనీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది వరదనీటి కాలువల మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయడంతో వరదనీరు వెళ్లిపోయింది.

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో..


చిక్కడపల్లిలో కురుస్తున్న వర్షం

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారుల్లో వర్షపునీరు నిలిచి కొంత మేరకు ట్రాఫిక్ స్తంభించింది. వీఎస్టీ చౌరస్తా, అశోక్‌నగర్ చౌరస్తాలో రోడ్లపై నిలిచిన వర్షం నీటిని జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ స్క్వాడ్ తొలగించి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చేశారు. సాయంత్రం వర్షం కురవడంతో ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే వారికి ఇబ్బందులు నెలకొన్నాయి.


చిక్కడపల్లిలో జరిగిన విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, మాజీ కార్పొరేటర్ పి.బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

ఏపీలో టీడీపీ విజయం.. ఇక్కడ సంబురం

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏపీలో వైఎస్ జగన్ ఆరాచక, నియంతృత్వ పాలనకు ప్రజలు గుణపాఠం చెప్పారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని అన్నారు. ఏపీలో టీడీపీ కూటమి భారీ మెజారిటీతో గెలవడాన్ని స్వాగతిస్తూ టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ చౌరస్తాలో విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. కేక్ ను పి.సాయిబాబా, మాజీ కార్పొరేటర్ పి.బాల్‌రాజ్ గౌడ్ తదితరులు కట్ చేసి, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయకుమార్‌గుప్తా, శివకృష్ణ, జీఎంనాయుడు, సాయి, రమేష్‌చారి, పుల్లయ్య, వీణాదేవి, అన్నపూర్ణ, శంకర్, సాగర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు మాదిగ సంఘాల మహాకూటమి కృషి

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి కృషి చేసిందని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌కుమార్ మాదిగ తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా తమ కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి సలహాదారులు సంగీత రాజలింగం, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జిలు బి.బాలకృష్ణ,ఎస్. ఎస్.రాజు, పుట్ట జంగన్న, చైతన్య, శివరాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలి


వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, సత్యం

బర్కత్‌పుర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 7 వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంతో ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు సాయి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్‌మార్కెట్ ఐపీవో పేరుతో మోసం

- లోన్ ఇప్పించి.. రూ.34.90 లక్షలు కొట్టేశారు
- ప్రత్యేక యాప్‌తో బురిడీ.. నిలువునా ముంచిన కేటుగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్‌లో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్(ఐపీవో)లో పెట్టుబడి పేరుతో.. సైబర్ కేటుగాళ్లు రుణం ఇప్పించి మరీ ఓ బాధితుడి నుంచి రూ.34.90 లక్షలు కొట్టేశారు. నగరానికి చెందిన సదరు బాధితుడి ఫిర్యాదుతో సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడు వాట్సాప్‌లో స్టాక్‌మార్కెట్ పేరుతో వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేశాడు. '657 ఐసెకన్' అనే వాట్సాప్ గ్రూపులో అతడు యాడ్ అయ్యాడు. ఆ గ్రూప్‌లో 140 మంది సభ్యులున్నారు. వారంతా రోజువారీ వ్యూహాలు.. లాభాల గురించి చర్చించుకుంటున్నారు. గ్రూప్ అడ్మిన్ నుంచి 'ఇంకా యాప్ డౌన్‌లోడ్ చేసుకోనివాళ్లు కింది లింక్ ద్వారా వివరాలను పంపొచ్చు' అనే సందేశాన్ని పోస్ట్‌చేశాడు. బాధితుడు స్పందించడంతో.. వ్యక్తిగత వివరాలను సేకరించి, అతడితో ఫేక్ బ్రోకరేజ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అందులో ట్రేడింగ్ చేసే సదుపాయం కల్పించారు. శివం కెమెకిల్స్ అనే కంపెనీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్స్(ఐపీవో)లో పెట్టుబడులు పెట్టాలంటూ యాప్ ప్రతినిధుల పేరుతో బాధితుడికి ఫోన్లు వచ్చాయి. బాధితుడు దానికి ఒప్పుకోకపోవడంతో.. సెబీ నుంచి భారీ పెనాల్టీ పడుతుందని హెచ్చరించారు. "నా దగ్గర డబ్బుల్లేవు" అని చెబితే.. బజాజ్ క్యాపిటల్ నుంచి భారీగా లోన్ ఇప్పించి, ఇన్వెస్ట్ చేయించారు. లాభాలు కూడా భారీగా వచ్చినట్లు యాప్‌లో కనిపించడంతో.. బాధితుడు విత్‌డ్రా చేసుకునేందుకు యత్నించగా.. ఆప్షన్ కనిపించలేదు. యాప్ ప్రతినిధులకు కాల్ చేసినా స్పందించలేదు. సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

న్యాయ పట్టభద్రులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన న్యాయ పట్టభద్రులకు మూడేళ్లపాటు ఉచిత నైపుణ్య శిక్షణ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందేవారికి నెలకు రూ.3 వేల స్టయిఫండ్, రూ.50 వేల డిజిటల్ బుక్స్, ఫర్నిచర్, కంప్యూటర్, డ్రెస్ ఇస్తామని తెలిపారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకునేందుకు ఫీజు కూడా చెల్లిస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 7 నుంచి జూలై 6వ తేదీలోపు tsepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.


అంబటి కృష్ణమూర్తిని సత్కరిస్తున్న సర్వే సత్యనారాయణ, వేణుగోపాలచారి

29 కార్మిక చట్టాలను తిరిగి సాధించుకోవాలి

బర్కత్‌పుర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను తిరిగి సాధించుకోవడానికి దేశవ్యాప్త ఉద్యమం చేపడుతున్నట్లు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అంబటి కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యకార్మిక నేతల సమావేశం భారతీయ కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గొల్లపల్లి దయానంద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే కార్మిక చట్టాలను పూర్తిగా రద్దుచేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. సర్వే సత్యనారాయణ, డాక్టర్ ఎస్.వేణుగోపాలచారి మాట్లాడుతూ కార్మిక ఉద్యమానికి కొత్త దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా అంబటి కృష్ణమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి బి.అమర్‌బాబు, కార్యదర్శి ఎం నాగరాజు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుంజ శ్రీనివాస్, ఐలయ్యగౌడ్, వీజీఆర్ నారగోని, సీహెచ్.బాలకృష్ణ, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ కులసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

కవాడిగూడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి కులగణన బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీసీ కులసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాంయాదవ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ఆయన చెప్పారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య, మాజీ ఎంపీ బండ ప్రకాష్‌ముదిరాజ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ తదితర ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కోలేటికి సర్వీస్ ఐకాన్ అవార్డు ప్రదానం


కోలేటి దామోదర్‌గుప్తాను సర్వీస్ ఐకాన్ అవార్డుతో సత్కరిస్తున్న నవరసగాయని ఆమని

చిక్కడపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తాను శృతిలయ సంస్థ వారు బుధవారం సర్వీస్‌ఐకాన్ అవార్డుతో సత్కరించి అభినందించారు. బుధవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లోని దామోదర్‌గుప్తా నివాసంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకురాలు, నవరసగాయని ఆమని మాట్లాడారు. దామోదర్‌గుప్తా సేవా కార్యక్రమాల ద్వారా ఎందరో పేదలకు సహకరించారని అన్నారు. ఆయన సేవలను గుర్తించి సర్వీస్ ఐకాన్ అవార్డుతో సత్కరించామన్నారు. సంఘసేవకులు బండాను సుబ్బారావు, కుసుమబోగరాజు, కార్తికేయ పాల్గొన్నారు.

సౌరశక్తిని ప్రోత్సహిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్

హైదరాబాద్ సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సౌరశక్తి(సోలార్ పవర్)ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ద్వారా వృక్ష సంపదను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, భూవినియోగ మార్పులు, నీటి వనరుల పర్యవేక్షణకు రిమోట్ సెన్సింగ్‌తో పాటు జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సాంకేతికతను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. సభ్య కార్యదర్శి జ్యోతి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ప్రమాదకరమైన వ్యర్థాలను సరైన రీతిలో నిర్వహించి కాలుష్య నివారణకు సహకరించాలని పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ పద్ధతుల ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్న పరిశ్రమలు, ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు, పొదుపు సంఘాల ప్రతినిధులకు అవార్డులను అందజేశారు. కార్యకమంలో పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రఘు, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు జయదేవ్ తదితరులు పాల్గొన్నారు. నోట్: ఆల్ జోన్స్ మస్ట్..

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

బర్కత్‌పుర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కావాలని రైల్వే సీఎంఎస్ డాక్టర్ కృష్ణవేణి, డీఎంవో డాక్టర్ ప్రణయవాణి, స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీలు పిలుపునిచ్చారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాచిగూడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం పర్యావరణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకుంటేనే మానవమనుగడ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఈఎన్‌హెచ్ఎం పి.బబ్లూ, ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, అశ్విని కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నగరాలు-పర్యావణంపై అధ్యయనం..!

- ప్లానింగ్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం

హైదరాబాద్‌సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా తెలంగాణ రీజనల్ చాప్టర్ ఆధ్వర్యంలో ప్లానింగ్ విద్యార్థులకు జాతీయ స్థాయిలో 2024కుగాను నిర్వహించిన పోటీల్లో విజేతలను ప్రకటించారు. డీటీసీపీ డైరెక్టర్ ఎస్.దేవేందర్ రెడ్డి చైర్మన్, కార్యదర్శి మురళీధర్‌రెడ్డి నేతృత్వంలో 'నగరాలు- పర్యావరణం' అనే థీమ్‌తో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. దేశంలోని ఏదైనా నగరంలో(నీళ్లు, వాతావరణం, ఎనర్జీ, వెజిటేషన్ తదితర సబ్ థీమ్‌లపై) అధ్యయనం చేసి శాస్త్రీయ విధానంలో పేపర్, పోస్టర్ సమర్పించారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. త్రిస్సూరు నగరంపై కోల్‌కతా ఎన్ఐటీకి చెందిన విద్యార్థులు అర్పియా, అనుశ్రీ, ఆదర్శ్ అధ్యయనం చేసి 'కర్బన ఉద్గారాలు- ప్రభావాల అంచనా'పై సమర్పించిన పేపర్‌కు ప్రథమ, 'బెంగళూరులో నీటి సంక్షోభం-వ్యూహాత్మక విధానాల విశ్లేషణ'పై హైదరాబాద్ జేఎన్ఏఎఫ్‌యూ విద్యార్థులు గాజుల అంజలి, మేగరాజ్ ధనుంజయ్, అభినయ్‌ఇంద్రాణి పేపర్‌కు ద్వితీయ, 'నీటి లభ్యత-సామాజిక, పర్యావరణ ప్రభావాలు' అంశంపై చెన్నైలో అవలంబిస్తోన్న విధానాలపైన ఎస్‌పీఏ ఢిల్లీకి చెందిన విద్యార్థులు కలంగుట్కర చిన్మయి, దేవేష్ పట్వారిట్, ధనుష్ కుమార్ సమర్పించిన పేపర్‌కు తృతీయ బహుమతి లభించాయి. సెమినార్‌లో వక్తలుగా పాల్గొన్న హైదరాబాద్ అర్బన్ ల్యాబ్స్ డైరెక్టర్ అనంత్ మరిగంటి, హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్ పెంటకొటోలు దేవేందర్‌రెడ్డితో కలిసి బహుమతులను ప్రదానం చేశారు.



రోజా మహిళా పొదుపు సంఘం ప్రతినిధులకు అవార్డు అందజేస్తున్న వాణీప్రసాద్

పర్యావరణాన్ని కాపాడుకో వాలి

నల్లకుంట: ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంపై ప్రభుత్వం కూడా ప్రత్యేకచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని టీడీపీ జాతీయ ప్రచారకార్యదర్శి జె.దశరథ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నల్లకుంటలో పర్యావరణ పరిరక్షణపై టీడీపీ కార్యకర్తలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలుచోట్ల ఆయన చెట్లకు నీరు పోశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, రాంచందర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.


కాచిగూడలో పర్యావరణ ర్యాలీ నిర్వహిస్తున్న రైల్వే అధికారులు


నల్లకుంటలో చెట్టుకు నీరుపోస్తున్న టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్

బాగ్‌అంబర్‌పేటలో చెట్ల కొమ్మల తొలగింపు

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేటలో షార్ట్‌సర్క్యూట్‌కు కారణమవుతున్న చెట్లకొమ్మల తొలగింపు పనులను బుధవారం జీహెచ్ఎంసీ హార్టికల్చరల్ అధికారులు, సిబ్బంది తొలగించారు. మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి ఈ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీహరి, సంతోష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE I[ST] SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD
O.S.NO. 274 OF 2023

BETWEEN:
Sri.G.Satyanarayana S/O.Late. G.Pandu rangam Age 65 years, Occ: Business R/O.12-1-614/50 Asif Nagar, Hyderabad .....Plaintiff/Petitioner

AND

Kurra Ramesh Goud, S/o.K.Raja Mallu Goud R/O.H.No.1-8-497/3, Chikkadpally, Hyderabad.T.s & others .....Defendant /Respondent

To,
Kurra Ramesh Goud,
Please take notice that the above named petitioner has filed the above said SUIT for Specific performance. The said O.S is posted to 10-06-2024 for the purpose of your appearance in the matter. Hence you are hereby requested to appear in person on 10.06.2024 at 10.30 A.M.before the above said court, otherwise the matter will be decided in your absence.

// BY ORDER OF THE COURT //
S.KANAKA RAJU, ADVOCATE
Office. 18-3-500/4, Lakshmi Nagar O/S, Aliyabad, Hyderabad, Cell No. 9849590488